అర్హులకు ఐదు గ్యారెంటీలు అందిస్తాం

- జిల్లా నోడల్ అధికారి ప్రశాంతి
- రెండో రోజు వెల్లువలా ప్రజా పాలన దరఖాస్తులు

దిలావర్‌పూర్ : సిర్గాపూర్‌లో దరఖాస్తులను స్వీకరిస్తున్న నోడల్ అధికారి ప్రశాంతి

దస్తురాబాద్ : అధికారులను వివరాలను అడిగి తెలుసుకుంటున్న ఆర్డీవో శ్రీ కళ

దిలావర్‌పూర్ డిసెంబర్ 29 : అర్హులైన పేదలందరికీ ప్రభుత్వం అమలు చేయనున్న ఐదు గ్యారెంటీలను అందిస్తామని నిర్మల్ జిల్లా నోడల్ అధికారి ప్రశాంతి పేర్కొన్నారు. శుక్రవారం సిర్గాపూర్ గ్రామంలో జరిగిన ప్రజాపాలనలో జిల్లా అదనపు కలెక్టర్‌తో కలిసి పాల్గొన్నారు. అనంతరం మహిళల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ ప్రజలు ఇబ్బందులు పడకుండా సంబంధిత కౌంటర్ల వద్దకు వెళ్లి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అధికారులు కృషి ఫలితంగా సిర్గాపూర్ గ్రామ రూపు రేఖలు మారిపోయాయని, తాను నిర్మల్ జిల్లా కలెక్టర్‌గా పని చేసిన మొదటి రోజుల్లో రోడ్డుకిరువైపులా చెత్త, చెదారం పేరుకుపోయి ఉండేదని నోడల్ అధికారి ప్రశాంతి పేర్కొన్నారు. ప్రస్తుతం అద్భుతంగా గ్రామం కనిపిస్తున్నదని పేర్కొన్నారు. సర్పంచ్ గంగారెడ్డి, అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, తహసీల్దార్ సరిత, ఎంపీడీవో మోహన్, ఎంపీవో అజీజ్‌ఖాన్, ఆర్ఐ సంతోష్‌కుమార్, ఏవో స్రవంతి, ఎంపీటీసీ రవిందర్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికే ప్రజా పాలన

భైంసా, డిసెంబర్, 29 : పేదల సంక్షేమం కోసమే పట్టణంలో ప్రజా పాలన సభలు నిర్వహిస్తున్నారని పలువురు కౌన్సిలర్లు పేర్కొన్నారు. శుక్రవారం సాదత్‌ఖాన్ ఫంక్షన్ హాల్‌లో 3, 5, 18 వార్డులకు సంబంధించిన ప్రజా పాలన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదు గ్యారెంటీల కోసం ప్రజల వద్ద నుంచి దరఖాస్తులను అధికారులు స్వీకరిస్తున్నారన్నారు.

భైంసాలో..

భైంసాటౌన్, డిసెంబర్, 29 : మండలంలోని వానల్‌పాడ్, వాటోలి, పాంగ్రి, చుచుంద్ గ్రామాల్లో అధికారులు ప్రజా పాలన దరఖాస్తులను స్వీకరించారు. డీఎల్పీవో శివకృష్ణ, తహసీల్దార్ ప్రవీణ్, ఎంపీడీవో గోపాలకృష్ణ రెడ్డి, ఎంపీపీ కల్పన, సర్పంచ్ మాన్కుర్ పెద్ద రాజన్న, నాయకులు రాంకుమార్, గణేశ్ పాటిల్, ఉప సర్పంచ్ దగ్డే ఈశ్వర్, కార్యదర్శి గాయత్రి, రూరల్ సీఐ నైలు, ముత్యం రెడ్డి, సోలంకిభీంరావు, పండిత్‌రావు, కారోబారి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

సారంగాపూర్, డిసెంబర్ 29 : ప్రభుత్వ సంక్షేమ పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని జడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. చించోలి(బీ) గ్రామంలో జరిగిన ప్రజాపాలన గ్రామసభ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పథకాల అమలు కోసం అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలన్నారు. గోపాల్‌పేట్, తాండ్రజ్రీ, బీరవెల్లి గ్రామాల్లో ప్రజా పాలన గ్రామసభలను నిర్వహించారు. ఇందులో సర్పంచ్‌లు చాట్ల లక్ష్మి, రవీందర్‌రెడ్డి, సల్ల లక్ష్మి, ఉమా, ఎంపీడీవో సరోజ, తహసీల్దార్ శ్రీదేవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయగౌరి, ఏపీఎం మాధురి, ఏపీవో లక్ష్మారెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు రాంశంకర్ గౌడ్, దశరథ రాజేశ్వర్, కరుణాసాగర్‌రెడ్డి, సాయన్న, మధూకర్ పాల్గొన్నారు.

ముథోల్‌లో..

ముథోల్, డిసెంబర్ 29 : ముథోల్‌తో పాటు ముద్గల్, తరోడా గ్రామాల్లో ప్రజా పాలన కార్యక్రమం కొనసాగింది. మండల కేంద్రంలో 6, మండలంలో 4 చొప్పున కౌంటర్లను ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజా పాలన కార్యక్రమాన్ని తహసీల్దార్ అతిఖొద్దీన్, ఎంపీడీవో సురేశ్ బాబు పరిశీలించారు.

ఖానాపూర్‌లో..

ఖానాపూర్, డిసెంబర్ 28: మున్సిపాలిటీలోని అంబేద్కర్‌నగర్, శ్రీరాంనగర్ కాలనీల్లో ఏర్పాటు చేసిన ప్రజా పాలన సభలో ప్రజలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి అభయహస్తం గ్యారంటీలకు దరఖాస్తు చేసుకున్నారు. కాగా లబ్ధిదారుల నుంచి మున్సిపల్ చైర్మన్ రాజేందర్, కమీషనర్ శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపాల్ అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. కౌన్సిలర్లు జన్నారపు విజయలక్ష్మి, నాయిని స్రవంతి, ఏఎంసీ వైస్ చైర్మన్ గొర్రె గంగాధర్, నాయకులు శంకర్, సంతోష్ పాల్గొన్నారు.

కుభీర్‌లో..

కుభీర్, డిసెంబర్ 29 : సోనారి, గొడ్సేరా, సాంగ్వి, మాలేగాం, దౌజు నాయక్‌తండా, కిషన్ నాయక్ తండా గ్రామాల్లో జరిగిన అభయ హస్తం ప్రజాపాలన దరఖాస్తులను ఎంపీపీ తూం లక్ష్మి స్థానిక సర్పంచ్ దత్తు గౌడ్ కలిసి ప్రజల నుంచి స్వీకరించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల నమ్మకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం మాట నిలబెట్టుకోవాలని కోరారు. తహసీల్దార్ సోము ఎంపీడీవో లింబాద్రి, ఏవో వికార్ అహ్మద్ పాల్గొన్నారు.

తానూర్‌లో..

తానూర్, డిసెంబర్, 29 : మండలంలోని బెల్‌తరోడ, ఝరి(బీ), మహాలింగి, భోసి గ్రామాలలో అధికారులు ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను స్వీకరించారు. తహసీల్దార్ లింగామూర్తి, మండల అభివృద్ధి అధికారి శ్రీనివాస్‌రావు బెల్‌తరోడ సర్పంచ్ గోపసాయినాథ్, పంచాయతీ కార్యదర్శులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

కుంటాలలో..

కుంటాల, డిసెంబర్ 29 : మండలంలో అంబకంటి, మెదన్‌పూర్, అందకూర్, పెంచికల్‌పాడ్‌లో శుక్రవారం ప్రజా పాలన కార్యక్రమం కింద దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. ఎంపీపీ అప్క గజ్జారాం పలు గ్రామాల్లో కౌంటర్లను పరిశీలించారు. తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్, ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి నాలుగు గ్రామాల్లో కౌంటర్లను ఏర్పాటు చేశారు. ప్రత్యేకాధికారి మసాన్ రావు, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు ప్రవీణ్, ప్రజా ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా పాలనను పకడ్బందీగా నిర్వహించాలి

దస్తురాబాద్, డిసెంబర్ 29 : ప్రజా పాలనను పకడ్బందీగా నిర్వహించాలని ఆర్డీవో రత్న కల్యాణి అధికారులను ఆదేశించారు. మండల కేంద్రంతోపాటు రేవోజిపేట గ్రామంలో శుక్రవారం నిర్వహించిన ప్రజా పాలన గ్రామసభలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామ సభలపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరి నుంచి దరఖాస్తులను స్వీకరించాలన్నారు. కాగా అంతకుముందు ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రజాపాలన గ్రామసభలను ప్రారంభించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

భైంసాటౌన్ : వానల్‌పాడ్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎంపీడీవో గోపాలకృష్ణా రెడ్డి

సాంగ్వీలో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎంపీపీ తూం లక్ష్మి

అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

సమస్యలను త్వరగా పరిష్కరించాలి

- ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్

బాసర, డిసెంబర్ 29 : ప్రజల సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ ఆదేశించారు. శుక్రవారం బాసర మండల అభివృద్ధి, పేదల సంక్షేమం కోసం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయ న పాల్గొన్నారు. ముందుగా ఆయాశాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల సాధనకు అధికారులు కృషి చేయాలన్నారు. మండలంలోని ఆయా గ్రామాల సమస్యలు, పరిష్కార మార్గాన్ని ఆయా శాఖల అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. మండల అధ్యక్షురాలు సునీత విశ్వనాథ్ పటేల్, భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ రాజేశ్ బాబు, బాసర జడ్పీటీసీ వసంత రమేశ్,వైస్ ఎంపీపీ నర్సింగ్ రావు, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్ గౌడ్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఆయా శాఖల అధికారులు ఉన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

మాట్లాడుతున్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మా బొజ్జూ పటేల్

ఖానాపూర్ రూరల్, డిసెంబర్ 29 : నియోజకవర్గంలోని పేద ప్రజలందరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మా బొజ్జూ పటేల్ పేర్కొన్నారు. ఖానాపూర్ మండలం బీర్నంది గ్రామంలో శుక్రవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. గ్రామస్తుల నుంచి అధికారులు ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తులను స్వీకరించారు. ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి మల్లిఖార్జున్, ఎంపీడీవో బాలె మల్లేశ్, తహసీల్దార్ పరిమల్ బ్రౌమిక్, ఎంపీవో చంద్రశేఖర్, వైస్ ఎంపీపీ వాల్‌సింగ్, గ్రామ సర్పంచ్ సాగి సువర్ణ, మడిగెల గంగాధర్, కడార్ల గంగనర్సయ్య, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మాంజ్రిలో విద్యార్థుల క్షేత్ర పర్యటన

క్షేత్ర పర్యటనలో నారాయణ పాఠశాల విద్యార్థులు

భైంసా, డిసెంబర్ 29 : పట్టణంలోని మాంజ్రి గ్రామ సమీపంలో గల ఆరాధన ఆయుర్వేద వెల్‌నెస్ సెంటర్, చుట్టుప్రక్కల ఉన్న పంటల పొలాలను నారాయణ పాఠశాల విద్యార్థులు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయుర్వేద ఔషధాల వల్ల కలిగే లాభాలు, వ్యవసాయం మానవ జీవితానికి కలిగే ఉపయోగాలు విద్యార్థులు అడిగి తెలుసుకున్నారు. ఇందులో ప్రిన్సిపాల్ సంగీత, జీఎం గోపాల్ రెడ్డి, ఏజీఎం కరుణాకర్, ప్రసన్న, ఏవో గజ్జారాం, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

నమూనా పద్ధతిలోనే ఖర్చులు అందించాలి

మాట్లాడుతున్న ఎన్నికల పరిశీలకులు శ్రీయాన్

నిర్మల్ టౌన్, డిసెంబర్ 29 : ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు ఎన్నికల ఖర్చుల వివరాలను నమూనా పద్ధతిలోనే అందించాలని ఎన్నికల వ్యయ పరిశీలకులు శ్రీయాన్ సూచించారు. కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్‌తో కలిసి ఇటీవల పోటీ చేసిన అభ్యర్థుల ఖర్చు వివరాలను సమర్పించగా వాటిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తప్పనిసరిగా ఖర్చు వివరాలకు రసీదు, రిజిస్టర్, బ్యాంకు అకౌంట్, తదితర వివరాలను అన్ని పక్కగా నమోదు చేయాలని కోరారు. ఖర్చు వివరాలను సమ ర్పించని అభ్యర్థులకు భవిష్యత్ లో ఇబ్బందులుంటాయని పేర్కొ న్నారు. ఆర్డీవో రత్నకల్యాణి, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనకు భూమిపూజ

భూమిపూజ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే నల్లా ఇంద్రకరణ్‌రెడ్డి, నాయకులు

సోన్, డిసెంబర్ 29 : నిర్మల్ మండలం నీలాయిపేట్‌లోని శివాజీ విగ్రహ ప్రతిష్ఠాపనకు మాజీ ఎమ్మెల్యే నల్లా ఇంద్రకరణ్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం భూమిపూజ నిర్వహించారు. మండలాధ్యక్షులు తోకల అనిల్ కుమార్, ఉపాధ్యక్షులు నర్సారెడ్డి, నాయకులు మురళీ, భీమేశ్, నారాయణ, సంతోష్, చిరంజీవి, మురళీగౌడ్, తదితరులున్నారు.

ధ్వజస్తంభం ఏర్పాటుకు విరాళం

నర్సాపూర్(జీ), డిసెంబర్ 29 : మండలంలోని తిమ్మాపూర్ గ్రామ శివారలో గల దత్తాత్రేయ ఆలయంలో ధ్వజస్తంభం ఏర్పాటు కోసం గ్రామానికి చెందిన మాటేగాం లింగారెడ్డి దేవయాణి దంపతులు రూ. 2.30 లక్షల విలువగల ధ్వజ స్తంభాన్ని ఆలయానికి బహూకరించారు. గ్రామస్తులు, వీడీసీ సభ్యులు అభినందించారు.

అవిశ్వాసం తగదు..

ఖానాపూర్, డిసెంబర్ 28: ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌పై పలువురు కౌన్సిలర్లు కక్ష సాధింపు చర్యగా అవిశ్వాస తీర్మాణం పెట్టడం తగదని తిమ్మాపూర్, ఖానాపూర్ వీడీసీ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం శాంతినగర్ హనుమాన్ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో వీడీసీ పెద్దలు మాట్లాడారు. వీడీసీ నాయకులు బీసీ రాజన్న, ద్యావతి రాజేశ్వర్, కరిపె శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, వెంకటప్పయ్య, సత్యనారాయణ, మురళి, నర్సింహులు, కాశీరాం, తదితరులు పాల్గొన్నారు.

ఒకరి ఆత్మహత్య

ముథోల్, డిసెంబర్ 29 : ఎడ్‌బిడ్ తండాకు చెందిన జాదవ్ అంబర్ సింగ్ (53) తాగుడికి బానిసై జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ సాయి కిరణ్ తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం కొద్ది రోజుల నుంచి అనారోగ్యానికి గురికావడంతో పాటు తాగుడికి బానిసయ్యాడు. మానసికంగా కృంగిపోయి జీవితం పై విరక్తి చెంది గురువారం రాత్రి ఇంట్లోకి వెళ్లి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అంబర్ సింగ్ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ వివరించారు. అంబర్‌సింగ్‌కు భార్య, కొడుకు, కుమార్తె ఉన్నారు.

పుడ్ ఫెస్ట్‌వెల్

తానూర్, డిసెంబర్ 29 : మండల కేంద్రంలోని వాగ్దేవి పాఠశాలలో శుక్రవారం ఎస్ఐ లోకం సందీప్ పుడ్ ఫెస్ట్‌వెల్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పాఠశాల విద్యార్థులు తయారు చేసిన వివిధ రకాల తినుబండారాలను పరిశీలించారు. విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఆరవిందర్‌రెడ్డి, డైరెక్టర్ అవినాశ్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు తయారు చేసిన తినుబండారాలను పరిశీలిస్తున్న ఎస్ఐ

పత్తి రైతులు ఆందోళన చెందవద్దు

నిర్మల్ టౌన్, డిసెంబర్ 29 : పత్తి రైతులు ఆందోళన చెందవద్దని, పత్తికి మద్దతు ధర కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని జిల్లా మార్కెటింగ్ అధికారి అశ్వక్ అహ్మద్ పేర్కొన్నారు. నిర్మల్ జిల్లాలో పత్తి రైతులకు మద్దతు ధరను కల్పించేందుకు మొత్తం 17 సీసీఐ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. కేంద్రం ప్రకటించిన పత్తి క్వింటాల్ ధరను రూ. 7020 చెల్లిస్తున్నామని, రైతులు ప్రైవేటు మార్కెట్లో విక్రయించకుండా సీసీఐ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని కోరారు.

ఒకరికి ఐదు రోజుల జైలు

సోన్, డిసెంబర్ 29 : మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి శుక్రవారం ఐదు రోజుల జైలు శిక్షను నిర్మల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ విధించారని నిర్మల్ రూరల్ ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు. నిర్మల్‌లోని రాంరావుబాగ్‌కు చెందిన సాయిచరణ్ మార్చిలో మద్యం తాగి వాహనం నడుపుతుండగా పోలీసులు పట్టుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు కోర్టులో నిందితుడిని హాజరుపర్చగా ఐదు రోజుల జైలు శిక్షను విధిస్తూ జడ్జి తీర్పు వెల్లడించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

వివాహిత అదృశ్యం

భైంసా, డిసెంబర్, 29: మండలంలోని కామోల్ గ్రామానికి చెందిన చాకలి పద్మ (35) వివాహిత శుక్రవారం అదృశ్యమైనట్లు పట్టణ సీఐ ఎల్ శ్రీను తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. ఇంట్లో గొడవపడి ఉదయం 10.30 గంటలకు కామోల్‌లోని ఇంటి నుంచి భైంసాకు బయలుదేరి వెళ్లినట్లు భర్త భోజన్న ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

అయ్యప్ప ఆలయంలో మహా పడిపూజ

అభిషేకం చేస్తున్న స్వాములు

భైంసా, డిసెంబర్ 29 : భైంసాలోని అయ్యప్ప స్వామి ఆలయంలో గురువారం రాత్రి అయ్యప్ప నామస్మరణతో మార్మోగింది. 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న రాజు గురుస్వామి పడిపూజ నిర్వహించారు. మహా గణపతి, సుబ్రహ్మణ్య స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అయ్యప్ప స్వామి వారికి 3 గంటలకు పైగా పడిపూజ నిర్వహించారు. గురు స్వామి భరత్ కుమార్, మంత్రి సాయి నాథ్, శీను, స్వాములు, భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందన

నిర్మల్ టౌన్, డిసెంబర్ 29 : భారత్ ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన హైదరాబాద్ నృత్య ప్రదర్శనలో బచ్‌పన్ స్కూల్‌కు చెందిన విద్యార్థి కే సుదిక్ష పాల్గొని గిన్నిస్ రికార్డులో చోటు దక్కించుకోవడంతో శుక్రవారం పాఠశాలలో విద్యార్థికి పాఠశాల యజమాన్యం సన్మానించారు. విద్యార్థినికి జ్ఞాపికను అందించారు. ప్రిన్సిపాల్ అయ్యన్నగారి రచన, కరస్పాండెంట్ అయ్యన్నగారి శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి

మాట్లాడుతున్న డీడబ్ల్యూవో రమేశ్

లోకేశ్వరం, డిసెంబర్ 29 : బాలింతలు, గర్భిణులు పోషకాహారం తీసుకోవాలని డీడబ్ల్యూవో రమేశ్ పేర్కొన్నారు. శుక్రవారం పుస్పూర్ గ్రామంలో రక్తహీనత సే నిర్మల్ ముక్త్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తహీనత నివారించేందుకు పోషకాహారాన్ని తీసుకోవాలని ఆయన సూచించారు. సర్పంచ్ నర్సయ్య, వైద్యాధికారులు శైలజ, పూజ సూపర్‌వైజర్ శ్రీలక్ష్మి, సీడీపీవో శ్రీమతి, జిల్లా మిషన్ శక్తి కోఆర్డినేటర్ సవిత, జెండర్ స్పెషాలిస్ట్ జ్యోతి, ఆర్థిక అక్షత నిపుణురాలు శైలజ పాల్గొన్నారు.

రాముల వారి అక్షింతలతో ఊరేగింపు

దస్తురాబాద్, డిసెంబర్ 29 : శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు నుంచి వచ్చిన అంక్షితలు శుక్రవారం రేవోజిపేట గ్రామానికి చేరుకున్నాయి. ఈ సందర్భంగా సీతారాముల ఆలయ అర్చకులు వంశీ చార్యులు ఆధ్వర్యంలో బస్డాండ్ ప్రాంతం నుంచి ఆలయానికి భక్తి గీతాలు, భజన సంకీర్తల నడుమ తలంబ్రాలను ఊరేగింపు ఆలయానికి తీసుకొచ్చారు. కాగా ఆలయ అర్చకులు తలంబ్రాలకు,స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు, మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిర్మల్‌టౌన్ : ప్రతినిధులను సన్మానిస్తున్న భక్తులు

దస్తురాబాద్ : రాముల వారి అక్షింతలను ఊరేగింపుగా తీసుకొస్తున్న భక్తులు

నిర్మల్‌లో పూజలు

నిర్మల్ టౌన్, డిసెంబర్29 : అయోధ్య నుంచి వచ్చిన రాముని అక్షింతలకు శుక్రవారం నిర్మల్‌లోని ప్రియదర్శినినగర్ కాలనీలో పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అయోధ్యలో మందిర నిర్మాణం పూర్తి కావడంతో భక్తుల ఆశీర్వాదం కోసం శ్రీరాముని స్పర్శ అక్షింతలు శోభాయాత్రతో నిర్మల్‌కు చేరుకున్నాయి. స్థానిక హనుమాన్, నిమిషాంబదేవి ఆలయంలో పూజలు నిర్వహించారు. నాయకులు గంగాధర్, ఉప్పిడి రవి, ప్రభాకర్, సోలాపూర్ రాజేశ్వర్, రాంపెల్లి నర్సయ్య, భీంరావు, తదితరులున్నారు.

పథకాలను వినియోగించుకోవాలి

మాట్లాడుతున్న జిల్లా నోడల్ అధికారి చంద్రశేఖర్

నిర్మల్ టౌన్, డిసెంబర్ 29 : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ను గ్రామీణ ప్రజలు సద్వినియోగం చేసుకునేందుకే వికాస్ సిత్ భారత్ సంకల్ప యాత్రను నిర్వహిస్తున్నట్లు జిల్లా నోడల్ అధికారి చంద్రశేఖర్ పేర్కొన్నారు. నిర్మల్‌లోని అంబేద్కర్ చౌరస్తా, సుభాష్‌చౌక్‌లో శుక్రవారం సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ద్వారా ప్రజలకు అమలవుతున్న పథకాలను వివరించారు. కుటుంబాల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎయిర్‌టెల్ టవర్ బ్యాటరీల చోరీ

భైంసా, డిసెంబర్ 29 : భైంసాలోని భైంసా–బాసర రోడ్డులో ఆటోనగర్ చౌరస్తా వద్ద సమీపంలో గల ఎయిర్‌టెల్ టవర్ షెల్టర్ నుంచి 14 బ్యాటరీలు చోరీకి గురైనట్లు సీఐ ఎల్ శ్రీను తెలిపారు. ఈ నెల 27న రాత్రి కారులో వచ్చిన కొందరు దుండగులు టవర్ షెల్టర్ తాళాలు పగుల గొట్టి రూ. 50 వేల విలువైన బ్యాటరీ సెల్స్ ఎత్తుకెళ్లారు. ఈ మేరకు ఎయిర్‌టెల్ టవర్ సిబ్బంది ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.